# నిర్ణయం - వి. పద్మ

"ఇదిగోనమ్రా, మన చీరల కుర్రాడు రానే వచ్చాడు" అంది టీచర్ వరలక్ష్మి కళ్ళజోడు సరిచేసుకుంటూ.

"ఇవాళ వచ్చాడేమిటే, ఫస్టు తారీఖు రేపయితేనూ" నాగరత్నం కామెంటు చేసింది.

"అవునవును. ఈ నెలాఖరులో అందరి చేతుల్లోనూ పర్సులయితే వుంటాయి కానీ అందులో 'పస' ఏమీ ఉండదు" అందరి లోనూ కాస్త పెద్దదయిన లక్ష్మీకాంతమ్మ నవ్వుగా అనేసింది.

లంచ్ అవర్లో టీచర్లందరూ భోజనాలు కానిచ్చేసి, తీరికగా కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఇంతలో చీరల కుర్రాడు లోపలికి రానే వచ్చాడు. చీరలమూట నెత్తిన పెట్టుకుని ఈ చీరల కుర్రాడు సంవత్సరానికి ఒకటి, రెండుసార్లు ఇలా వచ్చి మూటంతా ఒక్క గంటలో ఖాళీ చేసుకుని వెళ్ళడం మామూలే. ఈ అమ్మకంలో వాడికి, కొనడంలో వీళ్ళకి లాభం లేకపోలేదు. ఎంత ఖరీదైన చీరె అయినా సరే పైకం మొత్తం ఒక్కసారి చెల్లించే అవసరం లేదు. నెలకి 20 రూ. ప్రకారం ముట్టచెపితే చాలు. ఒక్కసారిగా డబ్బు పెట్టి ఖరీదైన చీరలు కొనలేని వాళ్ళకి ఈ పద్ధతి తేలికగా వుంటుంది. పైగా వాడు మంచిరకాలు కూడా తెస్తాడు. అందుకే ఈ చీరల వాడు రాగానే టీచర్లందరూ బెల్లం చుట్టూ ఈగలలాగా మూగి చీరల మూటవిప్పి నిముషంలో ఖాళీ చేస్తారు.

"వచ్చావా! మూడు నెలలయింది. ఎక్కడా పత్తా లేవు అనుకుంటున్నాం" వరలక్ష్మి చీరలవాణ్ణి పలకరించింది.

"వస్తే ఊరికె వస్తానా అమ్మా! మంచి మంచి రకాలు వుంటేనే గానీ రాను." చీరలు పరుస్తూ అన్నాడు

అందరు బిల బిల మంటూ చీరలచుట్టూ చేరారు.

ఇక్కడ ఇంత హడావిడి జరుగుతూ వున్నా లలిత మాత్రం ఇదంతా తనకి పట్టనట్టుగా నిన్న జరిగిన టెస్టు పేపర్లు దిద్దుతూ కూర్చుంది. ఈ విషయం నాగరత్నం గమనించింది.

"ఏమ్మా! లలితా, ఎదురుగా "పంచ భక్ష్య పరమాన్నాలు" ఉంటే రుచి చూడ ఏమిటి! అంది."

"నాకు ఇప్పుడు చీర కొనే వుద్దేశ్యం లేదండి" లలిత తల వంచుకుని పేపర్లు దిద్దుతునే అంది

"ఊరికే, చూడవోయ్, నచ్చితే తీసుకో, లేకపోతే లేదు" పంకజం అంది.

"చూడండి అమ్మగారు, ఇందులో బలవంతం ఏముంది" చీరల కుర్రాడు కూడా అనడంతో బాగుండదని లలిత పేపర్లు మడిచి తనూ చీరల దగ్గర కూర్చుంది.

"ఈ చీర చూడండి అమ్మా! డిజైన్ మీకు చాలా బాగా సూట్ అవుతుంది." కుర్రాడు పెద్ద పెద్ద పూలున్న చీర ఒకటి లక్ష్మీకాంతమ్మకి చూపించాడు.

"ఈ చీర కట్టుకుని వయసు దాన్ని అయిపోమంటావా నాయనా? మా వారు నన్ను గేలి చేస్తారు కూడానూ! నా కేమో, బోర్డరునూ, సన్న చుక్కలు వున్న చీరలు చూపించు" లక్ష్మీకాంతమ్మ అంది.

"అవును మరి, మీరు పైకి సన్న చుక్కలు అంటున్నారు గాని మీ కళ్ళన్నీ పెద్దపువ్వుల మీదే వున్నాయి అందుకే ఆ అబ్బాయి మీకు ఆ చీర చూపించాడు" పంకజం ఎత్తిపొడిచింది.

లక్ష్మీకాంతమ్మ గుర్రుగా చూసింది "నన్నేదో అన్నావు, మరి నువ్వంత ముదురు రంగు తీశావ్, అంత తెల్లగా వుంది" అంది కోపంగా నల్లటి పంకజాన్ని ఎదురుదెబ్బ కొడుతూ.

"సరే, సరే, ఇంక కబుర్లు మాని త్వరగా తెమల్చండి. అవతల టైం అయిపోతోంది" వరలక్ష్మి త్వరపెట్టింది.

ఇలా కబుర్లలతో, ఎత్తిపొడుపులతో అందరూ చీరలు సెలక్షన్ చేసుకున్నారు. లలిత స్నేహితురాలు మల్లిక తెల్లటి జార్జెట్ చీర తీసుకుంది.

"దీనిమీద నేను పెయింట్ చేస్తాను" అని "లలితా, నువ్వేమీ తీసుకోవా" అంది.

"ఉహుఁ!" అంది లలిత మౌనంగా.

"అదేమిటమ్మా! లలితా! నలుగురితో పాటు నారాయణా అనాలి. అందరం తీసుకున్నాం. నువ్వూ తీసుకో!" నాగరత్నం సలహా యిచ్చింది. ఇంతలో చీరల కుర్రాడు అడుగునపడివున్న చీర ఒకటి పైకి తీశాడు. అది లేత నీలం రంగు జార్జెట్ చీర దానికి బోర్డర్‌గా మూడువేళ్ళ వెడల్పుతో ముదురు నీలం రంగులో పువ్వులు, లతలు ఉన్న లేస్ వుంది. ఆ చీర ఎంతో అందంగా, అపురూపంగా, గుప్పెటలో పట్టుకుంటే యిమిడిపోయేటంత నాజూకుగా వుంది.

"మీది మంచి పసిమిరంగు, ఈ చీర మీ వంటికి అద్భుతంగా వుంటుంది చూడండి" అన్నాడు చీరల కుర్రాడు.

ఆ చీర లలిత మనసుని దోచుకుంది.

"అబ్బ, ఎంత బాగుందో ఈ చీర" అంది పంకజం.

లలిత మనసులో తల్లితండ్రులు, తమ్ముడు, చెల్లెలు కదిలారు ఎవ్వరికీ సరైన బట్టలు కూడా లేవు. తను ఈ చీర కట్టుకుంటే ఏం బాగుంటుంది?

"ఇంకా ఏటి ఆలోచిస్తున్నావు లలితా? ఆ చీర నీకు నచ్చలేదా?" నాగ రత్నం అడిగింది.

"బాగానె వుందండి!" అంది లలిత.

"అయితే ఇంకేం? ఎంతయ్య ఆ చీర ధర" వరలక్ష్మి అడిగింది.

కుర్రాడు చీర మీద వ్రాసిన ధర చూసి "199 రూ లు" అన్నాడు.

"మాట తొభై తొమ్మిదా! ఆ ఒక్క రూపాయి ఎందుకు నాయనా తక్కువ" చీర ధర వినేసరికి లలిత గుండె దడదడ లాడింది.

ఇంతవరకు తను కట్టుకున్న చీరలన్నీ తక్కువ ధరవే, ఇంత ధర పెట్టి చీర కొనలేదు.

"200 అయితే ఏమిటమ్మా? మీరు ఒక్కసారి యిస్తున్నారా డబ్బు? నెలకి 20 రూ. కదా మీరు యిచ్చేది" చీరల కుర్రాడు నచ్చచెప్పాడు

''అదీ నిజమే ఒక్కసారిగా ఇంత ధర పెట్టి బయట షాపులోతను కొనగలదా!'' లలిత మనసు నెమ్మదిగా చీరవైపే మొగ్గు చూపడం మొదలుపెట్టింది.

అమ్మా, నాన్నకి తను నచ్చచెపుతుంది. నాన్న తన మాట కాదనరు.

''మా ఇంట్లో చూపించి వాళ్ళకి నచ్చితే తీసుకుంటాను'' అంది లలిత చివరిసారిగా.

కుర్రాడు నవ్వాడు ''ఇంత చక్కటి చీర ఎవరికి నచ్చదు చెప్పండి? ఎవరికైనా ఈ చీర నచ్చలేదంటే వాళ్ళకి కళ్ళులేవని అర్థం.''

''ముందరి కాళ్ళకి బంధం బాగానే వేస్తున్నాడు'' వరలక్ష్మి గొణుక్కుంది.

''అదేమిటి? ఒకళ్ళకి నచ్చింది, యింకొకళ్ళకి నచ్చాలనీ రూలేముంది'' మల్లిక అంది.

ఏమయితేనేం, లలిత చీర తీసుకుని బయలు దేరింది.

అందరూ కుర్రాణ్ని హెచ్చరించారు డబ్బులు మాత్రం యివ్వాళ కాదు, రేపు యిస్తాం. రేపు ఫస్టుతారీఖు కాబట్టి, అని.

అందరూ చేతుల్లో క్రొత్త చీరలతో కళకళలాడే ముఖాలతో యిళ్ళకి బయలు దేరారు. లలిత, మల్లిక ప్రక్క ప్రక్కనే నడవసాగారు.

'అడుగోనే మన హీరో' అంది మల్లిక నడస్గా

ఆ హీరో ఎవరో లలితకి తెల్సుకాబట్టి తల ప్రక్కకి తిప్పి చూడలేదు. రెండు, మూడు నెలల నుండి ఆ అబ్బాయి బస్ స్టాపులో కనిపిస్తూనే వున్నాడు, తన స్నేహితులతో సహా. మంచి ఒడ్డూ,పొడుగు, తీర్చైన ముఖం, చక్కటి క్రాప్ వుండడమే కాకుండా, తనకి తగినట్లు మంచి బట్టలు వేసుకుని ఎప్పుడూ నీట్‌గా మల్లెపువ్వులా వుంటాడు.

ఒకరోజు మల్లిక కనిపెట్టి ''లలితా, ఆ అబ్బాయి ఎవరో మన వైపే చూస్తున్నాడే'' అని చెప్పింది. లలిత తల తిప్పి చూసింది.

అతను బిస్కెట్ కలర్ ఫ్యాంట్, డార్క్ కలర్ షర్టు వేసుకుని, క్రాప్ చక్కగా దువ్వుకుని నీట్‌గా వున్నాడు. లలిత తల తిప్పి చూడగానే అతను కొద్దిగా పెదవులు కదిపి నవ్వినట్లుగా చూశాడు. లలిత వెంటనే తల తిప్పేసుకుంది.

మల్లిక ''మనవైపు చూస్తున్నాడు'' అని చెప్పింది గానీ అతను చూసేది తన వైపు మాత్రమేనని లలిత గమనించింది. కానీ అతనేమో చెడువుద్దేశ్యంతో చూస్తున్నట్లుగా అనిపించలేదు. అతను మంచి సంస్కారవంతుడులాగే కనిపిస్తున్నాడు. కానీ ఎవరి మనసులో ఏముందో ఎవరికి తెలుసు. అందుకే లలిత మళ్ళీ అతనివైపు చూడలేదు. కానీ అతను రోజూ అక్కడ నిలబడి వుండడం మల్లిక ద్వారా తెలుస్తూనే వుంటుంది.

ఒకరోజు మల్లిక అతని గురించి సమాచారం సేకరించింది. అతని పేరు సుధీర్ అని, ఆంధ్రాబ్యాంక్‌లో కొత్తగా ఉద్యోగంలో



చేరాడనీ. ''ఇదంతా నీకెలా తెలుసు?'' లలిత అడిగింది.

''మవ్వు పట్టించుకోవు గదా అని యింకెవరు పట్టించుకోరా'' అని నవ్వింది మల్లిక.

లలిత ఆ తర్వాత ఎప్పుడూ అతని వైపు చూడలేదుకానీ ఒక్కనిముషం తను అతనిని చూడగానే అతను నవ్వబోవడం, అతను నిలబడిన తీరు, ఎప్పుడూ జ్ఞప్తికి వస్తూనే వుంటుంది. ఒక మనిషి తన్ను యిష్టపడు తున్నాడన్న నిజం ఆమెకి ఎంతో సంతృప్తిగా అనిపించింది.

ఇవాళ లలితికి అతను మాటి మాటికి జ్ఞాపకం వస్తున్నాడు. తనది చాలా పెద్ద జడ. తలంటుకుని తలలో మల్లెలు పెట్టుకుని, ఆ నీలంచీర కట్టుకుని, బొట్టూ, కాటుక పెట్టుకుని వస్తే తనని అతను ఎలాచూస్తాడో! మెచ్చుకున్నట్లు—చూస్తాడా?

''ఏమిటో ఏం మాట్లాడవు'' మల్లిక మాటలతో ఈ లోకానికి వచ్చింది లలిత.

'హీరో అదిగో అనగానే ఆలోచనల్లో పడ్డావా' ఉడికించింది మల్లిక.

''ఛీ, ఛీ, అతనిగురించి ఎవరాలోచిస్తు న్నారు?'' అంది లలిత.

మల్లిక తన మనసు కనిపెట్టిందని తెలియగానే లలిత ముఖం ఎర్రగా కందిపోయింది.

''ఇవాళ మన హీరో పుట్టినరోజను కుంటాను'' అంది మల్లిక.

''ఎలా తెలుసు'' అడిగింది లలిత.

''ఒక్కసారి అటుచూడు'' అంది మల్లిక.

అతను ఏదో విశేషం వున్నవాడిలాగె కనిపిస్తున్నాడు.

## నిర్ణయం

లలితవైపే చూస్తున్నవాడు, లలిత తన వైపు చూడగానే కళ్లలోకి సూటిగా చూశాడు. ఛీ అని తల తిప్పుకుంది లలిత. ఇలా చల్లని వెన్నెలలో, మల్లెపూల పాన్పుమీద పడుకున్న ట్లుగా వున్న ఆలోచనలన్నీ యిల్లు దగ్గర కాగానే ఆకాశంలో నుండి పాతళంలోకి విసిరి వేయిబడినట్లుగా అయింది. లలిత తండ్రి రెండేండ్ల క్రితమే రిటైర్ అయ్యారు అదే సమయానికి లలిత బి. ఎ. ప్యాసయి వెంటనే స్కూల్లో టీచర్‌గా చేరడంతో తండ్రికి కాస్త విశ్రాంతి దొరికినట్లు అయింది. తండ్రి ఖాళీగా వుంటే యిల్లు గడిచే ఆధారం లేదుకాబట్టి, ఆయన ఒక సరుకులదుకాణంలో లెక్కలు రాసే పనిలో చేరారు లలితకు, ఆయనకు వచ్చే ఆ కొద్ది మొత్తంలో యిల్లు గడవాలి తమ్ముడు, చెల్లెలు చదువులు నడవాలి—అమ్మకి వున్నది ఒక్కటే మంచి చీర. లలితకి, ఆమె తండ్రికి వచ్చేజీతం ఏ నెలకి, ఆ నెల అప్పు చేయకుండా గడవ డానికి ఎంతో కష్టం అవుతుంది. లలిత తండ్రి చాలా అభిమాన వంతుడు. తిండి లేకపోతే చావంలే, అప్పుకి మాత్రం చేయి జాపను అంటారు ఆయన.

ఇంటి పరిస్థితి తెలిసే యిటువంటి పని ఎలా చేసింది? ఈ చీర కట్టుకుని తమ వాళ్ల మధ్య ఒక్క నిముషమైనా నిలబడగలదా? లలిత తను చాలా తప్పు పని చేసినట్లు మదన పడ సాగింది.

లలిత గుమ్మంలో అడుగు పెట్టగానె వసారాలో కుర్చీలో కూర్చొని ఆమె తండ్రి పేపర్ చదువుతూ వున్నారు. లలితను చూడ గానె ''వచ్చావామ్మా'' పలకరించారు. తమ్ముడు, చెల్లి అప్పుడే స్కూలు నుండి వచ్చినట్లున్నారు. అమ్మ వంటగదిలో కాఫీ పెడుతోంది. లలిత ఆ రోజే తను ఈ ఇంటి పరిస్థితి గమనిస్తున్న దానిలా అందరిని మనస్సులోనే గమనించ సాగింది.

అలా కుర్చీలో కూర్చుని పేపర్ చదువు తున్న నాన్నకి వున్నవి రెండే రెండు మంచి చొక్కాలు, పంచలూ ఆయన అవి వేసుకునే వుద్యోగానికి పోతారు. తమ్ముడు, చెల్లి చిన్న వాళ్లయినా వాళ్ళకి యింటి పరిస్థితి బాగ తెలుసు వాళ్ళు ఏ నాడు మాకు 'ఇది కావాలి అని అడగరు అమ్మా, నాన్న తమని అలా పెంచారు ఎప్పుడూ మన స్థితికి తగినట్లుగ వుండాలి కానీ అందని అంతస్థుల కోసం ఎగ్రబాక కూడదని నాన్న ఎప్పుడూ చెపుతునే వుంటారు. అన్నీ తెలిసీ తను ఈ పని ఎలా చేసింది?

కాఫీ యిస్తూ అమ్మ అడగనే అడిగింది—''ఏమిటే ఈ కవరు'' అని.

లలిత ఒక్కసారి వులిక్కిపడింది.

''అది మనది కాదమ్మా. ఇవాళ స్కూలుకి చీరల వాడు వస్తే మల్లిక కొనుక్కుంది. మన యింట్లో చూపించి ఎలా వుందో కనుక్కోమంటే తెచ్చాను'' అంది లలిత.

ఆ చీర తీసి తల్లికి చూపించింది లలిత.


ఒక్కసారి చీర విప్పగానే నాజూకుగా, మెత్తగా వున్న చీర ''నీవు వుండవలసిన స్థానం యిదిగాదు సుమా'' అని వెటకారించి నట్లుగా అనిపించింది లలితకి.

''ఎంత బాగుందో చీర, అదృష్ట వంతురాలు. ఆ పిల్లకి ఎటువంటి బాధ్యతలు లేవు. వచ్చే జీతమంతా దాచుకుని ఇటువంటి చీరలు కొనుక్కుంటుంది. మేమూ వున్నాం, ఎందుకు దండగ. కూతురు జీతం మీద ఆధారపడి వున్నాం'' ఆవిడ పైకి ఉదాసీనంగా అన్నా, లోపల దుఃఖాన్ని ఆపుకున్న ట్లుగా కనిపించింది.

ఆ మాటలకి లలిత బాధ పడింది.

''ఇంకెప్పుడైనా ఆ మాట అంటే నా మీద ఒట్టేనమ్మా. నేనే మొగవాణ్ణయితే ఏం చేసేదాన్ని. నేను యీ యింటికి పెద్ద కొడుకునమ్మా ఇంకెప్పుడూ అలా బాధ పడకు'' అంది లలిత బాధగా.

ఆ రాత్రి పడుకుందేగానీ లలితకి నిద్ర



## తెలుగులో టైలర్ పుస్తకాలు



రెండు వాటి ఫ్యాషన్లతో బెల్‌ప్యాంట్లు, లాకులు 80 జాకెట్లు, 110 షర్ట్సు వగైరా 175 కటింగులు 3 వేల బొమ్మలతో 365 ప్లాన్లు 400 పేజీలు రు. 40 -

ప్రజలు పత్రికా ప్రశంస పొందిన 35 రకాలు స్వయంగా కత్తిరించి కుట్టేది 424 పే. 300 చిత్రాలు. రు. 40 అడ్వాన్సుగా రు. 5 పంపాలి.

జి. పున్నారావు చౌదరి,

వీరాపురం, తెనాలితాలూకా 522312

డా॥ పి. వి. కె. రావ్, B. A.,

వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్.

వివాహము వాయిదా వేయ నవసరము లేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్ఖలనములకు ఆయుర్వేద చికిత్స.

పోస్టుద్వారా చికిత్స కలదు.



**రావూస్ క్లినిక్,**

టి. బి. రోడ్, తెనాలి.

ఫోన్ : 700, 1010.




సహించలేని బాధ ఉందా? తీవ్రంగాదురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స. ఎంతమాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారి తీసి-శస్త్రచికిత్స తప్పని సరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేచనము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసుచేస్తున్నారు! హెడెన్‌సాలో ఉండే అమోఘమైన మందులు శీఘ్రంగా గుదాన్నిచ్చి బాధను దురదను శమింపచేస్తాయి విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు.

**గమనించండి సకాలంలో హెడెన్‌సా చికిత్స చేసుకుంటే మున్ముందు శస్త్రచికిత్స అవసరముండదు!**

7396 TG


# నిర్ణయం

పట్టలేదు. ఎందుకో చాలా బాధగా, ఆ బరువుని మనస్సు మోయలేనట్లుగా అనిపించింది లలిత కళ్లనుండి తనకు తెలియకుండానే నీళ్ళు జలజలా కారసాగాయి. తను ఏం పని చేస్తోంది? తండ్రి గీసిన లక్ష్మణ రేఖను దాటాలని చూస్తోందా? అందని అంతస్తుల కోసం ఎగ్రబాకాలని చూస్తోందా? ఆ చీరకోసం తను ఎందుకు ఆశపడింది? అలాగే తన మనస్సు సుధీర్ కోసం ఆశపడడం లేదుగదా? అతనికీ, తనకీ ఆకాశానికి భూమికి వున్నంత దూరం వుంది. అతను తనవైపు చూస్తే తను ఎందుకు సంతోషపడుతోంది. అలా తను ఎంతసేపు ఏడ్చిందో తనకే తెలియదు.

ఇంటికి రాకముందు దాకా తనని సంతోషపెట్టినచీరని ఇప్పుడు చూస్తే చాలు అసహ్యమనిపించింది. అంతకుముందు తనని చూపినవ్వాడని, తన కళ్లలో కళ్ళు పెట్టి చూశాడని సంతోషించిన కల్మషంతోవున్న తన మనసుని చూస్తే తనకి అసహ్యమనిపిస్తోంది. నెలకి ఇరవై రూపాయలు యిచ్చి తను రెండు వందల రూపాయల వెలకల ఆ చీరని తీసుకొనగలదు. కానీ అంత ఖరీదైన చీరను కట్టుకునే అర్హత తనకి లేదు. ఆ రెండు వందలు పెడితే ఇంటిల్లిపాది కాస్త మంచి బట్టలు కొనుక్కోవచ్చు.

ఆ చీరని రేపు తను వాపస్ ఇచ్చేస్తుంది. అలా తను యింకెప్పుడు సుధీర్ వైపు చూడను కూడా చూడదు, ఆలోచించదు.. అంతే ఈ విధంగా గట్టిగా నిర్ణయం చేసుకున్నాక లలితకి సంతృప్తిగా అనిపించింది.

మనస్సులో బరువు తగ్గినట్లుగా అనిపించాక ఆమెకి తెలియకుండానే ఎప్పుడో నిద్ర పట్టేసింది.

పొద్దునే లేచి ముఖం కడుక్కున్నాక రాత్రంతా ఏడ్చి ఏడ్చి ముఖం అంతా వుబ్బినా మనస్సు మాత్రం తేలికగా, బాధంతా తీసివేసి మబ్బులు పోయిన తర్వాత నిర్మలంగా వున్న ఆకాశంలా అయింది.

అందరూ భోజనాలు చేసేటప్పుడు లలిత తల్లి అడిగింది.

''సరుకులన్నీ నిండుకున్నాయండి'' అని.

''ఇవాళ మాకు జీతాలు వస్తాయిగా, కొందాం'' అన్నారు లలిత తండ్రి.

> ### కార్లకి హైడ్రోజను ఇంజను!
>
> జపానులోని ప్రభుత్వ పరిశోధనా సంస్థవారు క్రొత్తరకం హైడ్రోజను కారు ఇంజన్ను తయారు చేశారు. ఇందులో అల్పపీడనంలో గల హైడ్రోజను వాయువును ఇంధనంగా ఉపయోగిస్తారు. లోహ సమ్మేళన పదార్థాల నుండి తయారయ్యే హైడ్రోజను తక్కువ పీడనం కలిగి వుంటుందని పరిశోధనల్లో తేలింది. ఈ ఇంజనులో దీనినే ఇంధనంగా ఉపయోగిస్తారు. హైడ్రోజనువాయువు ఇంధనంగా గ్యాసోలిన్ కంటే సమర్థవంతంగా పనిచేయగలదని కూడా పరీక్షల్లో తేలింది. ఒక లీటరు హైడ్రోజనువల్ల 1010 కాలరీల ఉష్ణం ఏర్పడితే, గ్యాసోలిన్ వలన 848 కాలరీల ఉష్ణం మాత్రమే ఏర్పడింది.

''మాకు నోట్‌బుక్స్ కొనాలి నాన్నా'' అన్నాడు తమ్ముడు.

''తప్పకుండా కొంటాను'' అన్నారు లలిత తండ్రి.

''ఈ నెల నుండి ఎలాగైనా మనం నెలకి ఇరవై రూపాయలు దాచాలి నాన్నా'' అంది లలిత.

''ఎందుకమ్మా'' అన్నారు నాన్న ఆశ్చర్యంగా.

''ఇంట్లో ఎవరికీ సరైన బట్టలు లేవు. కాస్త రెండు, మూడు వందలు దాచామంటే ఇంట్లో అందరం గుడ్డలు కొనుక్కోవచ్చు'' అంది లలిత.

ఆయన నవ్వారు.

''ప్రతినెలా అప్పులేకుండా గడిచేసరికి దేవుడు దిగి వస్తున్నాడు'' అన్నారు.

''ఎలాగైనా సరే నాన్నా, మనం కాస్త దాచుకోవాలి. నేను దాస్తాను నాన్నా! మనం కూడా అందరిలా మంచి బట్టలు కట్టుకోవాలి'' ఈ మాటలు లలిత పైకి అనలేదు కాని మనస్సులోనే దృఢనిశ్చయంతో గట్టిగా అనుకుంది.